



సిరిసిల్ల సెస్‌లో ఏర్పాటు చేసిన గృహజ్యోతి కౌంటర్

'గృహజ్యోతి' సర్వే షురూ

- జిల్లాలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు 1,42,966 దరఖాస్తులు
- తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులు 1,73,368 మంది
- గృహజ్యోతి అర్హులు 86,472 మంది
- మార్చిలో జీరో బిల్లు వచ్చేలా చర్యలు
- సిరిసిల్ల సెస్‌లో ప్రత్యేక కౌంటర్
- ఇంటింటా వివరాల సేకరణకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లోని గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇందుకోసం జిల్లాలోని సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్) పరిధిలో సర్వేను ప్రారంభించారు. స్పాట్ బిల్లింగ్ మిషన్‌లలోనే వివరాలు నమోదు చేసే విధంగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అందించారు. స్పాట్ బిల్లింగ్ మిషన్ ద్వారా సిబ్బంది విద్యుత్ మీటర్ కనెక్షన్ల ప్రకారం ఆధార్, రేషన్ కార్డు, ఫోన్ నంబర్ల వివరాలు నమోదు చేసుకునే సమయంలో లబ్ధిదారులు లేని పక్షంలో సిరిసిల్ల సెస్ కార్యాలయంలో నమోదు చేసుకోవడానికి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేశారు. ఫిబ్రవరి మాసంలో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించిన లబ్ధిదారులకు మార్చి నెలలో జీరో బిల్లు వచ్చే విధంగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

● అద్దె ఉన్నవారికి వర్తింపు

గృహ జ్యోతి పథకంలో అద్దెకు ఉన్నవారికి కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను వర్తింపజేయనున్నారు. జిల్లాలో తెల్ల రేషన్ కార్డుల లబ్ధిదారులు 1,73,768 మంది ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం మంది ఉచిత విద్యుత్‌కు అర్హులు ఉన్నారు. తెల్లరేషన్ కార్డులు కలిగిన వారిలో బోయినపల్లి మండలంలో 11,905 కార్డులు, చందుర్తి 10,963, గంభీరావుపేట 14,404, ఇల్లంతకుంట 15,553, కోనరావుపేట 13,919, ముస్తాబాద్ 14,385, రుద్రంగి 4846, సిరిసిల్ల 26,833, తంగళ్లపల్లి 14,099, వీర్నపల్లి 4205, వేములవాడ 19,568, వేములవాడ రూరల్ 7440, ఎల్లారెడ్డిపేట 15,648 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. ఉచిత విద్యుత్‌లో ఇంటి యజమానితో పాటు తెల్లరేషన్ కార్డు ఉన్న అద్దె దారులు కూడా గృహజ్యోతి అర్హులుగా గుర్తించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు.

● జిల్లాలో 1,64,849 గృహ అవసరాల కనెక్షన్లు

సిరిసిల్ల సెస్‌పరిధిలో 2 లక్షల 69 వేల 204 వివిధ రకాల విద్యుత్ కనెక్షన్లు ఉండగా గృహ అవసరాల కనెక్షన్లు 1,64,849 ఉన్నాయి. ఇందులో సిరిసిల్ల పట్టణంలో 35,249 కనెక్షన్లు ఉండగా కోనరావుపేటలో 11,103, తంగళ్లపల్లి 14,356, ఇల్లంతకుంట 13,066, వేములవాడ టౌన్ 17,619, వేములవాడ రూరల్ 5846, వేములవాడ అర్బన్ 7239, బోయినపల్లి 10,633, చందుర్తి 11,342, ఎల్లారెడ్డిపేట 16,308, ముస్తాబాద్ 11,388, గంభీరావుపేట 10,700 గృహ అవసరాల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల ఉచితం కోసం ప్రజాపాలనలో జిల్లాలో 1,42,966 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో తెల్లరేషన్ కార్డును పరిగణలోకి తీసుకోవడంతోపాటు 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగం, పరిశ్రమలు, కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు మినహాయించి సెస్‌లో 73 వేల600 మంది అర్హులు ఉన్నారని ప్రాథమిక అంచనా వేశారు. దీని ప్రకారం సెస్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆహారభద్రత కార్డు నంబరు, ఆధార్ నంబరు, మొబైల్ నంబరును ఎస్‌బీఎంద్వారా అప్‌డేట్ చేస్తున్నారు. మార్చిలోనే గృహజ్యోతి పథకం అమల్లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

డబుల్‌బెడ్ రూం ఇళ్లకు

విద్యుత్ సరఫరా నిలిపివేత

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 7: మండలంలోని పెద్దలింగాపూర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లలో అనధికారికంగా నివాసం ఉంటున్న వారికి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. పెద్దలింగాపూర్‌లో 40 డబుల్ బెడ్‌రూంలను నిర్మించిన ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసింది. పంపిణీలో ఆలస్యంతో రెండు రోజుల క్రితం లబ్ధిదారులు తాళాలు పగలగొట్టి ఇళ్లలో నివాసం ఉంటున్నారు. వారిని ఖాళీ చేయించడానికి అధికారులు ప్రయత్నించి విఫలమయ్యారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పక్కనే విద్యుత్ స్తంభాల నుంచి లబ్ధిదారులు విద్యుత్ వాడుకుంటున్నారు. విషయం తెలుసుకున్న సెస్ అధికారులు బుధవారం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సమీపంలోనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సరఫరాను నిలిపివేశారు. ప్రభుత్వం స్పందించి విద్యుత్ సరఫరా చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. దీనిపై సెస్ ఏఈ రాకేష్‌రెడ్డిని వివరణ కోరగా డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో విద్యుత్ మీటర్లు లేవని, అక్రమంగా విద్యుత్‌ను వాడుకుంటున్నారనే సమాచారం మేరకు సరఫరా నిలిపివేశామని తెలిపారు. విద్యుత్ మీటర్లు తీసుకుంటే సరఫరా పునరుద్ధరిస్తామన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పేదల సంక్షేమానికి పెద్దపీట

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 7: పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. నమిలిగుండుపల్లి గ్రామంలో బుధవారం పలు అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తామన్నారు. నియోజకవర్గంతోపాటు రాష్ట్రంలో ప్రజలు మార్పుకోరుకున్నారని, కాంగ్రెస్ పార్టీకి అవకాశమిచ్చారని అన్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పథకం పరిమితి రూ.10 లక్షలకు పెంపు అమలు చేసినట్లు చెప్పారు. ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చే మరో రెండు పథకాలైన రూ.500లకే సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ మరో వారంలో అమలవుతుందన్నారు. నియోజకవర్గంలో సాగునీటి రంగాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. గ్రామంలోని పాఠశాలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం తుర్కాష్‌నగర్, ఫాజుల్‌నగర్, వట్టెంల గ్రామాల్లో నిర్వహించిన కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీలు రంగు వెంకటేశం, బొడ్డు శంకరవ్వ రాములు, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, నాయకులు సంఘస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి మరణాలు తగ్గించాలి

సిరిసిల్ల ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రసూతి మరణాలు పూర్తిగా తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మాతా శిశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ప్రసూతి మరణాలపై సమీక్ష నిర్వహించారు. ప్రసూతి సమయంలో గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిండం, గతంలో ప్రభావితం చేసిన అంశాలను అధిగమించడం వంటి అంశాలపై చర్చించారు. గతంలో ప్రసూతి సమయంలో ఆరోగ్య సమస్యలతో చనిపోయిన గర్భిణులు, శిశువుల వివరాలపై ఆరా తీశారు. మృతుల కుటుంబ సభ్యులనడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణుల్లో పరీక్షలతోపాటు హైరిస్క్ కేసులను గుర్తించాలని, వారికి మెరుగైన ట్రీట్‌మెంట్ అందించాలని అన్నారు. రకరకాల పారామీటర్‌లలో కేసులు వస్తాయని, ఎలాంటి కేసుకు ఏ టీట్‌మెంట్ చేయాలో ప్రొటోకాల్ ప్రకారం చికిత్స అందించాలని అన్నారు. ప్రసూతి మరణాలను తగ్గించడానికి ఆశా, ఏఎన్‌ఎం, క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. జిల్లా డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వోలు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ రజిత, డాక్టర్లు సంతోష్, మురళీధర్ రావు, మహేష్‌రావు, నీలిమ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

రాణాదివస్‌తో ప్రజలకు మరింత చేరువ



ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ముస్తాబాద్ ఫిబ్రవరి 7: ప్రజలకు మరింత చేరువగా పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా రాణా దివస్ కార్యాక్రమాన్ని చేపట్టినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన రాణాదివస్‌లో మాట్లాడారు. గ్రామస్థాయిలో శాంతిభద్రతల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించినట్లు చెప్పారు. ముస్తాబాద్‌లో 68 ఆర్జీలు వచ్చాయని, వాటి పరిష్కారం దిశగా వెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. తమ పరిధిలో లేని సమస్యలను సం బంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు, పరిష్కారమయ్యే వరకు పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు కమ్యునిటీ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నామని, ప్రజలతో మమేకం అవుతున్నామని తెలిపారు. డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ సదన్ కుమార్, ఎస్సై శేఖర్‌రెడ్డి, ఎఎస్సై వెంకటరమణ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మండలంలోని తుర్కపల్లెలో ఏర్పాటు చేసిన 5 సీసీ కెమెరాలను గ్రామ సభ్యులతో కలిసి బుధవారం ప్రారంభించారు. అన్ని గ్రామాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ సదన్‌కుమార్, ఎస్సై శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పద్మదుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

గంభీరావుపేట, ఫిబ్రవరి 7: గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటలో మాగ అమావాస్య సందర్భంగా జరిగే ఆంజనేయస్వామి జాతర ఏర్పాట్లను సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాంమోహన్ బుధవారం పరిశీలించారు. ఈ నెల 9 నుంచి ప్రారంభమయ్యే అంజన్న జాతర ఏర్పాట్లలో భక్తుల సౌకర్యాలపై ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో చర్చించారు. ఎంపీటీసీ రాజేందర్, ఆలయ కమిటీ చైర్మన్ మణిదీప్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటేష్ ఉన్నారు.

జిల్లా స్థాయి

వాలీబాల్ చాంపియన్ షిప్ పోటీలు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 7: జిల్లాస్థాయి వాలీబాల్ ఛాంపియన్ షిప్ - 2024 మహిళలు, పురుషుల పోటీలను ఈ నెలలోనే నిర్వహిస్తామని, 15లోగా కలెక్టరేట్‌లోని రెండో అంతస్తులో జిల్లా యువజన, క్రీడా శాఖ కార్యాలయంలో ఎంట్రీ ఫీ చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలని జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి అజ్మీరా రాందాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఒక జట్టుకు రూ.1000 ఎంట్రీ ఫీ చెల్లించాలని, పేరు నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9440239783, 9059465889 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి

ముస్తాబాద్, ఫిబ్రవరి 7 : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సీజీఆర్‌ఎఫ్ చైర్ పర్సన్ అండ్ మెంబర్ టెక్నికల్ యస్ రామకృష్ణ పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని సెస్ సేవాసదన్‌లో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు రైతులు అధికారుల తీరుపై మండిపడ్డారు. రెండేళ్లుగా విద్యుత్ సంబంధిత దరఖాస్తు చేసిన పరిష్కారం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెస్‌లో భారీగా అవినీతి ఉందని,ఎ తీసి వేయాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. పలువురు రైతులు తమ సమస్యలపై ఫిర్యాదులను అందించారు. పలు గ్రామాల ఏఈలు, సెస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'సిరి పోషణ్'తో పోషకాహార లోపానికి చెక్



రాగిలడ్డూ పంపిణీని ప్రారంభిస్తున్న కరుణ

- రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకటి కరుణ
- జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు ప్రారంభం

ముస్తాబాద్, ఫిబ్రవరి 7 : పోషాకాహార లోపాన్ని అధిగమించేందుకు జిల్లాలో ప్రయోగాత్మకంగా చేపట్టిన సిరి పోషణ్ కార్యక్రమం దోహదపడుతుందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకటి కరుణ అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వారానికి ఒకసారి మిల్లెట్, రాగి లడ్డూ పంపిణీకి నెల రోజులపాటు చేపట్టనున్న సిరి పోషణ్ పైలట్ ప్రాజెక్ట్‌ను బుధవారం కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి లాంచనంగా ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలు ఆరేళ్లలోపు పిల్లల్లో పోషకాహార లోపం నివారించే దిశగా జిల్లాలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కరుణ మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నా పోషకాహార లోపంతో మహిళలు, పిల్లలు బాధపడుతున్నారన్నారు. రాష్ట్రంలో 40 శాతం మహిళలు ఎనీమియాతో, 30 శాతం పిల్లలకు వయస్సు తగిన బరువు ఎత్తు లేదన్నారు. పైలెట్ ప్రాజెక్టు ద్వారా గర్భిణులు, బాలింతలు ఆరేళ్లలోపు పిల్లలకు వారానికి ఒక సారి రాగి లడ్డూలు, రాగి జావ, మొలకెత్తిన విత్తనాలు, మల్టీ మిల్లెట్ లడ్డూ అందించడం ద్వారా పోషకాహార లోపం అనే నెగెటివ్ ఫ్యాక్టర్ పాజిటీవ్‌గా మార్చి తద్వారా వారికి పోషకాహార లోపంతో వచ్చే వ్యాధులను దూరంగా ఉంచవచ్చన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు మిల్లెట్‌ల ప్రాధాన్యంపై అవగాహన పెరుగుతుందన్నారు.

విద్యా, వైద్యరంగాల బలోపేతానికి కలెక్టర్ ప్రత్యేక చొరవ

జిల్లాలలో విద్యా, వైద్య రంగాల బలోపేతానికి కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేక చొరవ తీసుకోవడంతోపాటు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకటి కరుణ అన్నారు. చిరుధాన్యాల ప్రాధాన్యం తెలిపేందుకు మిల్లెట్ ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేస్తూ గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులకు పోషకాలతో కూడిన రాగి లడ్డూలను అందజేస్తున్నారన్నారు. జిల్లా ప్రజల ఆరోగ్యానికి కలెక్టర్ చేస్తున్న కృషి అమోఘమని, కలెక్టర్‌గా ఇక్కడ అనురాగ్ ఉండడం అదృష్టమని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మేమే మీ బంధువులం.. అధైర్యపడవద్దు.. నిరాధరణకు గురైన వయో వృద్ధులకు ప్రభుత్వం అండగా ఉంటుంది అని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ భరోసా ఇచ్చారు. బుధవారం తంగళ్లపల్లి మండలం మండెపల్లి ప్రభుత్వ వయో వృద్ధుల కేంద్రాన్ని కార్యదర్శి కరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న 33 మంది వృద్ధులను ఆత్మీయంగా పలకించారు. వారి ఆరోగ్య పరిస్థితి తదితర అంశాలను తెలుసుకున్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు వాకింగ్, ఇండోర్ గేమ్స్ ఆడాలని సూచించారు. కార్యదర్శి ఆత్మీయ పలకరింపుతో వృద్ధులు ఆనంద బాష్పాలు రాల్చారు. కేంద్రంలో సౌకార్యలు బాగున్నాయని వివరించారు.

- తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులోని కస్తూర్బా పాఠశాలను రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి అరుణ సందర్శించారు. కస్తూర్బా గ్రామీణ ప్రాంత కిశోర బాలికల కోసం జీవన నైపుణ్యాలు పెంపొందిగడానికి టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ సౌజన్యంతో ప్రయోగాత్మకంగా అమలవుతున్న షీరో ప్రాజెక్ట్‌ను కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి పరిశీలించారు. ఇందులో భాగంగా పిల్లలు సైన్స్ పాఠాలు, టెక్నాలజీ, ఇంగ్లీష్, మ్యాథమెటిక్స్ తదితర సబ్జెక్టులలో నైపుణ్యం పెంపొందించడానికి ప్రత్యేక పరికరాల ద్వారా అందిస్తున్న శిక్షణ తీరును, వివిధ రకాల కృత్యాలను పరిశీలించారు.
- కంగ్రాట్యులేషన్..చాలా బాగా చెప్పారు అంటూ విద్యార్థినులను కార్యదర్శి అభినందించారు. మారుముల గ్రామీన ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థినులు ఆధునిక ప్రపంచంతో పోటీ పడేలాగా జీవన నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. డీఈవో రమేష్‌కుమార్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, కస్తూర్బ ప్రిన్సిపాల్ శ్యామల తదితరులు ఉన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి కరుణ

మార్కండేయ జయంతి, మాఘమాస జాతరకు ఆహ్వానం



ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు

సిరిసిల్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో ఈనెల 12న నిర్వహించనున్న శివభక్త మార్కండేయ స్వామి శోభాయాత్ర జయంతి ఉత్సవాలకు బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కే తారకరామారావును పద్మశాలి సంఘం ప్రతినిధులు ఆహ్వానించారు. బుధవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. సిరిసిల్ల పద్మశాలి పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, కార్యదర్శి మండల సత్యం, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్, గాజుల బాలయ్య ఉన్నారు.

● సిరిసిల్లలో ఈనెల 9న మాఘ అమావాస్య సందర్భంగా నిర్వహించే గంగమ్మ, రామప్ప రామలింగేశ్వర, మడలేశ్వర స్వామి జాతరలకు కేటీఆర్‌ను రజక సంఘం, గంగపుత్ర సంఘం, నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు ఆహ్వానించారు.

కుష్టు నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమాలు



డీఎంఅండ్‌హెచ్‌వోలో అవగాహన సమావేశం

సిరిసిల్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుష్టు నిర్మూలనకు ప్రత్యేక కార్యాక్రమాలు చేపడుతున్నామని, వ్యాధి ప్రారంభంలోనే చికిత్స అందిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రజిత అన్నారు. బుధవారం జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ జిల్లాలో 34 మంది కుష్టు వ్యాధిగ్రస్థులు చికిత్స పొందుతున్నారన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ప్రాథమిక ఇరోగ్య కేంద్రాల డాక్టర్లను, లెప్రసీ నోడల్ అధికారులను సంప్రదించాలన్నారు. సమావేశంలో డీపీఎంవో చేపూరి శ్రీనివాస్, రేవూరి కాశీనాథం, కూన సురేష్, రేబెల్లి శ్రీనివాస్ పాల్గొనారు.

జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌కు ఎంపిక

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 7: జిల్లాకు చెందిన గొట్టెముక్క శేఖర్, ఎం.లక్ష్మీ జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలో జాతీయ పోటీలకు ఎంపికైన మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గొట్టెముక్కల శేఖర్, ఎం.లక్ష్మీని మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చీటి నర్సింగరావు, డీవైఎస్‌వో అజ్మీరా రాందాస్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దేవత ప్రభాకర్ అభినందించారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ 100 మీటర్‌ల రన్నింగ్‌లో శేఖర్ స్వర్ణం సాధించగా, లక్ష్మీ 800, 1500 మీటర్స్‌లో స్వర్ణ పతకాలను సాధించి జాతీయ పోటీలకు ఎంపికైన్నారు. ఫిబ్రవరి 24న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగే 7వ నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ రన్నింగ్ పోటీలో శేఖర్, లక్ష్మీ పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు దుప్పటి రవికుమార్, బొడ్డు నారాయణ, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు గొట్టె అంజయ్య క్రీడాకారులు పాల్గొన్నారు.

మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాజీ సర్పంచ్, మాజీ ఉప సర్పంచ్, మాజీ వార్డు సభ్యులను స్థానికులు బుధవారం సన్మానించారు. గ్రామాబివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. పదవులు లేకపోయినా ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మధు, మాజీ ఉప సర్పంచ్ ప్రదీప్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై అశోక్

రుద్రంగి, ఫిబ్రవరి 7: సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై సిరిసిల్ల అశోక్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లోని విద్యార్థులకు సైబర్ నేరాలపై బుధవారం వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అశోక్ మాట్లాడుతూ ఎవరైనా బాధితులు సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. డైరెక్టర్ ఎర్రం గంగనర్సయ్య, ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వరిలో మొగి పురుగు నివారణపై అవగాహన

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 7: వరిలో సల్ఫైడ్ దుష్ప్రభావం, మొగి పురుగు సమగ్ర సస్యరక్షణ విధానాలపై చెక్కపల్లిలో జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త, కో ఆర్డినేటర్ డాక్టర్ కె.మదన్‌మోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటలో సల్ఫైడ్ దుష్ప్రభావం, మోగిపురుగు సమస్య ఎక్కువగా కనిపిస్తుందన్నారు. వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీరణాధికారి అనూష తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పేరుతో పేదలకు కుచ్చుటోపీ

● రూ.కోటిన్నరకు పైగా వసూలు ● ఏడుగురిపై కేసు.. ఇద్దరి అరెస్టు

ముస్తాబాద్, ఫిబ్రవరి 7: పేదలకు ఇళ్లు కట్టిస్తామన్న ఓ స్వచ్ఛంద సంస్థ వారికి కుచ్చుటోపి పెట్టింది. ముస్తాబాద్ మండలం మోయినికుంట, మద్దికుంట, మోర్రాయిపల్లె గ్రామాల్లో సిటిజన్స్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ అనే స్వచ్ఛంద సంస్థ డబల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని వసూళ్లకు పాల్పడింది. ఐదేళ్ల క్రితం మూడు గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థ తరఫున ఇళ్లు కట్టించేందుకు లబ్ధిదారుడు వాటా చెల్లించాలని పేర్కొంది. దీంతో మూడు గ్రామాల్లోని పేదలు రూ.లక్ష నుంచి రెండు లక్షల వరకు అప్పు చేసి ప్రతినిధుల చేతిలో పెట్టారు. గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పేదల నుంచి డబ్బులు తీసుకొని ఒప్పందం చేసుకున్నారు. 2020సంవత్సరంలో జరిగిన ఒప్పందంలో లబ్ధిదారుడి వాటా రూ.3.50 లక్షలు చెల్లించాలని, మరో ఆరున్నర లక్షలు సంస్థ ద్వారా చెల్లించేందుకు అంగీకరించారు. కొంత మంది లబ్ధిదారులకు సంస్థ రాయి, సిమెంట్ స్టీలు పంపించి బెస్‌మెంట్ వరకు పనులు చేపట్టారు. రోజులు గడుస్తున్న పనులు పూర్తి కాకపోవడంతో సంస్థ ప్రతినిధులను సంప్రదించగా స్పందించలేదు.

మూడు గ్రామాల్లో దాదాపు వంద మందికి పైగా లబ్ధిదారులు రూ. కోటిన్నర చెల్లించినట్లు భావిస్తున్నారు. మద్దికుంట, మొర్రాయిపల్లె, మోయినకుంట గ్రామాల్లో కొంతమందికి చెల్లిం చిన డబ్బుల మట్టుకు ఇంటి నిర్మాణ ముడి సరుకు అందినట్లు తెలిపారు.

ఠాణాను ఆశ్రయించిన బాధితులు

డబ్బులు చెల్లించలచినా పనులు మొదలు పెట్టకపోవడంతో ఆందోళన చెందిన లబ్ధిదారులు కొంత మంది పోలీసులను ఆశ్రయించారు. 2022లోనే మోయినికుంట, మద్దికుంట, మోర్రాయిపల్లెకు చెందిన బాధితులు ముస్తాబాద్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు సంస్థ ప్రతినిధులు కె వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భూపతిరెడ్డి, మరో నలుగురిపై సోమవారం కేసు నమోదు చేశారు. అదేరోజు శ్రీనివాస్‌రెడ్డి, భూపతిరాజును రిమాండ్‌కు తరలించారు. మూడు గ్రామాల్లో ఇళ్లు నిర్మిస్తామని స్వచ్ఛంద సంస్థ పేదల వద్ద భారీ వసూళ్లకు పాల్పడి మోఖం చాటేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న కారు

● ఇద్దరి మృతి..

ఒకరి పరిస్థితి విషమం

శంకరపట్నం, ఫిబ్రవరి 7: శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామంలో కరీంనగర్-వరంగల్ హైవేపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కరీంనగర్ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న కారు కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి ఆలయ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న హనుమకొండకు చెందిన తాళ్లపల్లి కొంరమ్మ(68), కరీంనగర్‌కు చెందిన నీర్ల ప్రభాకర్ (58)లు అక్కడికక్కడే మృతి చెందారు. తాళ్లపల్లి సదానందం, తాళ్లపల్లి గీతలకు తీవ్ర గాయాలయ్యాయి. గీత పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడు ప్రభాకర్ భార్య సబిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. ఆగి ఉన్న టిప్పర్‌కు పార్కింగ్ లైట్లు వేయక పోవడంతోనే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

రూ.6,650 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 7: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,650 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 82మంది రైతులు 758క్వింటాళ్లు విడి పత్తి, 13మంది రైతులు 19క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,650, కనిష్ఠ ధర రూ.5,500 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 7:దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరికి ఎనిమిది నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ పెద్దపల్లి జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని బసంత్‌నగర్ ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గత ఏడాది సెప్టెంబర్ ఒకటిన పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ శివారులో గల హన్‌మాన్ దేవాలయంలో హుండీ పగలకొట్టి అందులో గల ఇరవై వేల రూపాయల నగదు దొంగిలించారు. దర్యాప్తులో హన్మకొండకు చెందిన పాశం ప్రణీత్, ఉమర్ ఫరూక్ చోరీకి పాల్పడినట్లు తేలింది. అప్పటి ఎస్‌ఐ గంగరాజు గౌడ్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితులకు ఎనిమిది నెలల కఠిన కారాగార శిక్ష విధించారు. కేసును ప్రస్తుత బసంత్‌నగర్ ఎస్‌ఐ వెంకటేశ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాకేష్ ఆధ్వర్యంలో కోర్టు పీసీ సంజయ్ కేసును ట్రయల్ నడిపించారు.

ఆచంపల్లి గ్రానైట్ ఫ్యాక్టరీలో చోరీకి యత్నం

గంగాధర, ఫిబ్రవరి 7: గ్రానైట్ ఫాక్టరీలో బుధవారం వేకువ జామున ఆరుగురు గుర్తు తెలియని మహిళలు చోరీకి యత్నించారు. గంగాధర మండలం ఆచంపల్లిలోని గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలో వేకువ జామున సిబ్బంది నిద్రిస్తున్న సమయంలో కొందరు మహిళలు చోరీకి ప్రయత్నించారు. గ్రానైట్ కటింగ్ మిషన్‌కు నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన 10 హెచ్‌పీ మోటర్ల విద్యుత్ తీగలను కత్తిరించారు. ఇదే సమయంలో శబ్దం రావడంతో ఫ్యాక్టరీ సిబ్బంది కేకలు వేశారు. సుమారు ఆరుగురు మహిళలు ఆటోలో పారిపోతుండగా ఫ్యాక్టరీ సిబ్బంది ద్విచక్రవాహనాలపై వెంబడించి కొత్తపల్లి మండలం నాగుల మల్యాల వద్ద వారిని పట్టుకున్నారు. మహిళలు మానకొండూరు మండలానికి చెందిన వారిగా తెలిసింది. సిబ్బంది అప్రమత్తతతో గ్రానైట్ ఫ్యాక్టరీ పెద్ద మోటర్లను కాపాడగలిగారు. దీనిపై ఎస్‌ఐ అభిలాష్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

డబ్బులు ఇవ్వాలని బెదిరించిన వ్యక్తి రిమాండ్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 7: సిరిసిల్ల పట్టణం చంద్రంపేటకు చెందిన రమణారెడ్డిని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ ఉదయ్‌రెడ్డి బుధవారం తెలిపారు. రమణారెడ్డి భూ తగాదాల్లో మధ్యవర్తిత్వం చేస్తూ డబ్బులు, భూమి డిమాండ్ చేసేవాడని పేర్కొన్నారు. చంద్రంపేటకు చెందిన రాజు అనే వ్యక్తిపై హత్యాప్రయత్నం చేసిన సంఘటనతో పాటు అతడిపై మరో నాలుగు కేసులు నమోదయ్యాయని తెలిపారు. దర్యాప్తులో భాగంగా రమణారెడ్డి కోసం గాలిస్తుండగా కోర్టులో లొంగిపోయాడని, మెజిస్ట్రేట్ రిమాండ్‌కు తరలించారని పేర్కొన్నారు. తన భూ సమస్య పరిష్కారానికి రమణారెడ్డిని సంప్రదించగా సెటిల్‌మెంట్ చేస్తానని చెప్పి రూ.3లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా రూ.1లక్ష అడ్వాన్సుగా తీసుకొని భూసమస్య పరిష్కారం చేయలేదని, అయినప్పటికీ మిగితా రూ. 2లక్షలు ఇవ్వాలని ఒత్తిడిచేశాడని లేదంటే 100గజాల స్థలం రిజిస్ట్రేషన్ చేయాలని బెదిరించడమే కాకుండా ఈ నెల 5న వేములవాడకు వెలుతుండగా తనపై హత్యాప్రయత్నం చేశాడని బాధితుడు చంద్రంపేటకు చెందిన తుంగ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

రాయికల్, ఫిబ్రవరి 7: రాయికల్ పట్టణానికి చెందిన దాసరి చిన్న నర్సయ్య (70) జ్ఞాపకశక్తి కోల్పోయి ఈ నెల 4న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం మధ్యాహ్నం చిన్ననర్సయ్య మృతదేహం రాయికల్ గ్రామ శివారులోని జన్నయి చెరువులో లభ్యమైంది. చిన్న నర్సయ్య మతిస్థిమితం సరిగా లేక ప్రమాదవశాత్తు నీటిలో పడి చనిపోయాడని అతని భార్య దాసరి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

రాజన్న వసతి గదుల బుకింగ్ కంప్యూటరీకరణ

వేములవాడ, ఫిబ్రవరి 7: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం వసతి గదులను ఆలయ అధికారులు కంప్యూటరీకరించారు. ఇప్పటి వరకు ఆలయ వసతి గదుల కేటాయింపును ఉద్యోగులు మ్యానువల్‌గా చేసేవారు. ఇకపై కంప్యూటర్ ద్వారా వసతి గదులను కేటాయించడానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. వసతి గదుల కేటాయింపు విషయంలో ఆలయ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్న తరుణంలో రాష్ట్రంలోని ఇతర ఆలయాల తరహాలో వసతి గదుల కేటాయింపును కంప్యూటర్ ద్వారా చేసేందుకు నిర్ణయించడంతో సామాన్య భక్తులకు సైతం గదులు సులభంగా లభించే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. వసతి గది కోసం వచ్చే యాత్రికుడు తప్పనిసరిగా విచారణ కార్యాలయానికి వచ్చి ఫొటో గుర్తింపు కార్డుతో పాటు స్వామి వారి అద్దె గదిలో ఉండే వారి వివరాలను వెల్లడిస్తే కంప్యూటర్‌లో నమోదు చేసి గది అద్దె మొత్తం, అడ్వాన్సు చెల్లించిన తర్వాత గది కేటాయిస్తారు. 24 గంటల్లో వసతి గది ఖాళీ చేయని యాత్రికుడికి సంబంధించి అడ్వాన్స్ మొత్తాన్ని తదుపరి అద్దె కింద జప్తు చేస్తారు. వసతి గదుల కంప్యూటరీకరణ ద్వారా ఆలయంలోని ఏఏ వసతి సముదాయంలో ఎన్ని గదులు ఖాళీ ఉన్నాయని వాటిపైన సైతం సంబంధిత సిబ్బందికి స్పష్టమైన అవగాహన ఏర్పడుతుంది. ఇదిలా ఉండగా భీమేశ్వర సదన్, పార్వతిపురం వసతి సముదాయాలకు అదనపు కౌంటర్‌ను ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆలయ అధికారులు తెలిపారు. టి యాప్ ద్వారా ముందస్తు బుకింగ్ సౌకర్యం.. రాజన్న సన్నిధికి వచ్చే భక్తులు వసతి గదులను ముందస్తుగా ఆన్‌లైన్ ద్వారా రిజర్వ్ చేసుకునేందుకు టి యాప్ పోలియో యాప్, మీసేవ పోర్టల్ అవకాశం కల్పించారు. వసతి గదుల బుకింగ్‌తో పాటు శ్రీస్వామి వారి ఆర్జిత సేవలకు సంబంధించిన పూజల టికెట్లను ముందస్తుగా బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించారు. ఆన్‌లైన్ ద్వారా రాజన్న ఆలయ వసతి గది బుక్ చేసుకోవాలనుకునేవారు కనీసం వారం రోజులు ముందుగా బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రస్తుతం నందీశ్వర వసతి గదుల సముదాయంలో 112 నాన్ ఏసీ గదులు, 55 ఏసీ గదులు, 8 సూట్లు ఉండగా, లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌లో 98 నాన్ ఏసీ గదులు, పార్వతీపురంలో 110 నాన్ ఎసి గదులు, భీమేశ్వర సదన్ 56 ఏసీ గదులు, 4 సూట్లు, 4 గెస్ట్ హౌస్‌లు, అమ్మవారి కాంప్లెక్స్‌లో 4 ఏసీ గదులు అందుబాటులో ఉన్నాయి.



వేములవాడలో వసతి గదుల విచారణ కార్యాలయం

రాజన్న హుండీ ఆదాయం రెండు కోట్ల 15 లక్షలు

వేములవాడ, ఫిబ్రవరి 7: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఖజానాకు హుండీ ద్వారా రెండు కోట్ల పదిహేను లక్షలకు పైచిలుకు ఆదాయం సమకూరింది. గత 14 రోజుల వ్యవధిలో భక్తులు శ్రీ స్వామివారి హుండీలలో సమర్పించిన కానుకలను ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా 2 కోట్ల 15 లక్షల 67 వేల 130 రూపాయల నగదు, 71 గ్రాముల 500 మిల్లి గ్రాముల బంగారం, 13 కిలోల 600 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ ఈవో డి కృష్ణ ప్రసాద్ తెలిపారు.

వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయానికి స్థలం కేటాయించాలి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 7: కరీంనగర్‌లో వాణిజ్య పన్నులశాఖ కార్యాలయ భవన నిర్మాణానికి 20 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని అధికారులు, ఉద్యోగులు కోరారు. బుధవారం ఉమ్మడి జిల్లా వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సిహెచ్.రవికుమార్, తెలంగాణ వాణిజ్య పన్నులశాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. ముజాహిద్‌హుస్సేన్, కరీంనగర్ డివిజన్ అధ్యక్షుడు గుంటి భిక్షపతి ఆధ్వర్యంలో కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

కోతుల దాడిలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో బుధవారం కోతులు దాడిలో అదే గ్రామానికి చెందిన వృద్ధుడు అలివేలి నారాయణ తీవ్ర గాయాలపాలయ్యాడు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నారాయణ తన ఇంటి నుంచి బస్టాండు వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా నాలుగు వానరాలు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచాయి. పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. కాగా గ్రామంలో కోతుల బెడద అధికంగా ఉందని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇళ్లలోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి గ్రామంలో కోతుల బెడదను నివారించాలని కోరుతున్నారు.

మేడారం జాతర ఏరాట్లు పరిశీలించిన ఆర్ఎం

భగత్‌నగర్, ఫిబ్రవరి 7: సమ్మక్క సారలమ్మ మేడారం జాతరకు కరీంనగర్ బస్టాండ్‌లో బస్సుల పాయింట్ల ఏర్పాట్లను బుధవారం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎస్ సుచరిత పరిశీలించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణానికి అవకాశం ఉన్నందున మేడారం జాతరకు భక్తులతాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగు నీరు, ఇతర మౌళిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. కరీంనగర్-1, 2డిపోల్లో ఇతర డిపోల నుంచి వచ్చే ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన వసతి సౌకర్యాలను పరిశీలించారు. ప్రయాణికులకు చల్లని నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని బస్‌స్టేషన్ మేనేజర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ వెంకటేశ్వర్‌రావు, డిప్యూటీ రీజినల్ మేనేర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, డిప్యూటీ ఆర్ఎం మెకానికల్ కె సత్యనారాయణ, డిపో మేనేజర్లు ఎల్‌మల్లేశం, విమల్లయ్య, రజనీకృష్ణ, వీరస్వామి, నజీర్ ఉన్నారు.


బస్టాండ్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం సుచరిత

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 7: సిరిసిల్ల పట్టణంలోని సిద్ధార్థనగర్‌లో రాగుల ప్రవంతి అలియాస్ లాస్య(30) అనే వివాహిత అదనపు వరకట్న వేధింపులకు బలైంది. భర్త, అత్తలు అదనంగా రూ.10 లక్షలు వరకట్నం ఇవ్వాలని గత కొంతకాలంగా వేధిస్తుండటంతో ఆత్మహత్యకు పాల్పడింది. సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన ప్రవంతిని ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన రాగుల నాగరాజుతో ఆరు సంవత్సరాల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో రూ.20 లక్షల వరకట్నం, ఇతర లాంచనాలు ఇచ్చారు. వీరికి అయిదేళ్ల కూతురు, రెండేళ్ల బాబు ఉన్నారు. ప్రవంతి బీటెక్ పూర్తిచేయగా భర్త నాగరాజు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సర్దాపూర్ 17బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వీరు సిద్దార్థనగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం ప్రవంతి వాంతులు చేసుకోవడంతో అనుమానం వచ్చిన భర్త స్థానిక ఆస్పత్రికి చికిత్స కోసం తరలించాడు. పరిస్థితి విషమించడంతో చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించగా అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో హైద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించగా రాత్రి మృతిచెందింది. భర్త నాగరాజు అదనంగా రూ. 10లక్షల వరకట్నం తీసుకురావాలని వేధించడంతో పాటు బాబు పుట్టేంత వరకు అబార్షన్ చేయించాడని, తల్లిదండ్రుల మాటలు వింటూ భార్యను హింసించేవాడని దీనితోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రవంతి పురుగుల మందు తాగి ఉంటుందని పోలీసులు భావి స్తున్నారు. ఈ సంఘటనపై అనుమానాస్పద కేసుగా నమోదు చేసి మృతదేహనికి పంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. కాగా తల్లి మృతితో ఇద్దరు చిన్నారులు విలపించడం విషాదం నింపింది.


ప్రవంతి (ఫైల్)

భర్తపై కేసు నమోదు

ప్రవంతి మృతి కేసులో కానిస్టేబుల్ అయిన భర్త నాగరాజు, అతని తల్లిపై 304బి సెక్షన్ కింద కేసు నమోదు చేశామని టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. ఈ కేసులో నాగరాజును అరెస్ట్ చేశామని గురువారం రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.

బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో దొంగల చేతివాటం

● జేబులు కట్ చేసి నగదు, ఫోన్లు అపహరణ

ధర్మపురి, ఫిబ్రవరి 7: ధర్మపురి పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరైన కొందరు నాయకుల జేబులు కట్ చేసి నగదు, మొబైల్ ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అపహరించారు. సమావేశం ముగిసిన తరువాత కార్యకర్తలు భోజనం చేసేందుకు వెళ్లే సమయంలో ఫంక్షన్ హాల్ రద్దీగా మారింది. ఆ సమయంలోనే జేబులు కత్తిరించి పర్సులు, మొబైల్ ఫోన్లు అపహరించారు. పాక వెంకటేషం వద్ద నుంచి రూ.12,000, కోఆప్షన్ మెంబర్ ఎండీ అలీ మొబైల్ ఫోన్, బొల్లె భగత్ కుమార్ వద్ద రూ.4,000, రాచకొండ ఆనంద్ వద్ద రూ 5,500, కాశెట్టి వీరేశం నుంచి రూ. 18,000, మరి కొందరు వ్యక్తుల నగదు, మొబైల్ ఫోన్లు అపహరించారు. ఫంక్షన్ హాల్ సీసీ కెమెరాల ఆధారంగా చోరీలకు పాల్పడ్డ వ్యక్తులను పట్టుకోవాలని కోరుతున్నారు.

మాజీ నక్సలైట్‌పై పీడీ యాక్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 7: వేములవాడ పట్టణం తిప్పాపూర్‌కు చెందిన మాజీ నక్సలైట్ మానుక కుంటయ్య(45)పై జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్‌ల ఆదేశాల మేరకు పీడీయాక్ట్ అమలు చేస్తూ ఆ ఉత్తర్వులను అందజేసి బుధవారం చర్లపల్లి జైలుకు తరలించినట్లు టౌన్ సిఐ కరుణాకర్ తెలిపారు. తిప్పాపూర్‌కు చెందిన కుంటయ్య గతంలో జనశక్తి అనే తీవ్రవాద గ్రూపులో పనిచేసి ఆ తర్వాత లొంగిపోయి భూ సమస్యలపై జోక్యం చేసుకుంటూ యజమానులను బెదిరిస్తూ వారి నుంచి డబ్బు వసూలు చేసేవాడని తెలిపారు. మానుక కుంటయ్య నేర కార్యకలాపాలను నిరోధించడానికి జిల్లా పరిధిలో భూ సంబంధించిన విషయాల్లో 8 కేసులలో నిందితునిగా ఉన్నప్పటికీ తన కార్యకలాపాలను మార్చుకోనప్పటికీ కుంటయ్యపై వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ తెరిచినట్లు తెలిపారు. అయినప్పటికీ అతను నేర కార్యకలాపాలను కొనసాగిస్తూ ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తుండటంతో కుంటయ్యపై పీడీ యాక్ట్ అమలు చేశారని, ఇట్టి ఉత్తర్వులను అందజేసి చర్లపల్లి జైలుకు తరలించామని ఆయన తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బోడ సాయికుమార్ పురుగుల మందు తాగి బుధవారం ఆత్మహత్యకు యత్నించాడని స్థానికులు తెలిపారు. గ్రామంలోని సాయికుమార్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని పేర్కొన్నారు. బుధవారం ఉదయం తన స్నేహితులతో కలిసి విందు చేసుకున్నారని చెప్పారు. అనంతరం తాను పురుగుల మందు తాగుతున్నానని పేర్కొంటూ సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసి మిత్రులకు వాట్సప్‌లో పోస్టు చేశాడని పేర్కొన్నారు. గ్రామ శివారులోకి చేరుకున్న స్నేహితులు సాయికుమార్‌ను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని తెలిపారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు నిర్ధారించారని పేర్కొన్నారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియడం లేదని చెప్పారు. ఈ విషయంపై ఎస్‌ఐ రమాకాంత్‌ను వివరణగా తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో ఏడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 7: బాలికను కిడ్నాప్ చేసి అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో వేములవాడ పట్టణానికి చెందిన ఎర్రం సాయి కిరణ్‌కు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత బుధవారం తీర్పు ఇచ్చినట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. అక్టోబరు 7,2016న ఓ బాలికను సాయికిరణ్ కిడ్నాప్ చేసి అసభ్యంగా ప్రవర్తించడంతో పోక్సో కేసు నమోదైనట్లు సీఐ తెలిపారు.

బొగ్గు రంగ సంస్థలను నాశనం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

● 16న జరిగే సమ్మెను విజయవంతం చేయండి ● సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

గోదావరిఖని, ఫిబ్రవరి 7: బొగ్గు రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నాశనం చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఆరోపించారు. బుధవారం గోదావరిఖని చౌరస్తాలోని శ్రామిక భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహజ సంపద అయిన బొగ్గు బ్లాకులను కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అమ్మకానికి పెట్టిందని, అందులో భాగంగానే సింగరేణిలోని నాలుగు బొగ్గు బ్లాకులను ఈ వేలం ద్వారా గుత్తేదార్లకు అమ్మడం కోసం ప్రయత్నాలు సాగిస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి కొంగు బంగారమైన సింగరేణిని కాపాడడం కోసం ఈనెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలోని 160బొగ్గు బ్లాకులను అంబానీ, అదానీలకు అమ్ముతున్నారని, ప్రభుత్వరంగ ఆస్తులను కాపాడుకోకపోతే దేశంలోని పేదరికాన్ని నిర్మూలించలేమన్నారు. పదేళ్ల కాలంలో దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రధాని నరేంద్ర మోదీ అమ్మకానికి పెట్టి అందులో పని చేస్తున్న కార్మికులను రోడ్డున పడవేశారని విమర్శించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పకపోతే రానున్న రోజుల్లో దేశం సర్వనాశనం అవుతుందని, దీన్ని ప్రజలు, కార్మికులు, కర్షకులు గుర్తుంచుకొని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి, ఎర్రవెల్లి ముత్యం, ఉల్లి మొగిలి, ప్రవీణ్‌కుమార్, వెంకన్న, రాజేశం, శ్రీహరి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

సూక్ష్మ కళాకారుడికి మూడు ప్రపంచ రికార్డులు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 7: జిల్లా కేంద్రంలోని తులసీనగర్‌కు చెందిన డాక్టర్ గుర్రం దయాకర్ అనే సూక్ష్మ కళాకారుడు తన ప్రతిభను చాటుతున్నాడు. మూడు ప్రపంచ రికార్డులు పొంది జగిత్యాల పేరును కీర్తికెక్కించాడు. అయోధ్య రామ మందిర ప్రతిష్ఠ పర్వదినాన్ని పురస్కరించుకుని అద్భుతమైన రామమందిర సూక్ష్మ కళారూపాన్ని తయారుచేసి అబ్బురపరిచాడు. 60 గంటల పాటు కష్టపడి 60 వేలకు పైగా బియ్యపు గింజలు ఉపయోగించి తయారు చేసిన విగ్రహానికి మూడు ప్రపంచ రికార్డులు దక్కాయి. భారత్ వరల్డ్ రికార్డ్స్, టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు దయాకర్ ప్రతిభను గుర్తించారు. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో మూడు ప్రపంచ రికార్డులకు సంబంధించిన సర్టిఫికెట్లను ప్రముఖ సినీ నటుడు బాబూమోహన్ చేతుల మీదుగా అందజేశారు.


ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న దయాకర్

15న జేఎల్ఎం సర్టిఫికెట్ల వెరిఫికేషన్

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 7 : ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 15న గురువారం జేఎల్ఎం 5వ విడత జాబితా నియామకం కొరకు అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, పోలు ఎక్కించే పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. ఈ పరీక్షలు నియామక కమిటీ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. వీరి జాబితాను వారి చిరునామాకు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపనున్నట్లు తెలిపారు. ఎవరికైనా లెటర్ ముట్టకపోతే ఎస్ఈ కార్యాలయంలో వారి ఐడీ కార్డు చూపించి కాల్ లెటర్లు పొందవచ్చని తెలిపారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 7: ఉమ్మడి జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 10న నిర్వహించనున్నారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉదయం 10 నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 10 గంటలకు హ్యాండ్‌బాల్ సంఘం సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్‌లకు మైదానంలో రిపోర్టు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94419 25807 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 21 వరకు అవకాశం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 7: ఉమ్మడి జిల్లాలో ఓపెన్ స్కూల్ ప్రవేశాలు పొందిన విద్యార్థులు పది, ఇంటర్మీడియట్ పరీక్షలు రాసేందుకు ఈ నెల 12 నుంచి 21లోగా పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థులు ప్రతి సబ్జెక్టుకు 100, ఇంటర్మీడియట్ విద్యార్థులు రూ.150, ప్రాక్టికల్స్‌కు రూ.150 చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఒక్కో సబ్జెక్టుకు 25 రూపాయల అపరాధ రుసుముతో ఈ నెల 27వ తేదీ వరకు, రూ.50 తో మార్చి 4వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు.

పోలీసు కస్టడీకి భూకబ్జా నిందితులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 7: నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి అక్రమంగా భూకబ్జాలకు పాల్పడిన కేసులో వారం రోజుల నుంచి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న తీగల గుట్టపల్లి మాజీ ఎంపీటీసీ కొమ్ము భూమయ్య, గుంజ లక్ష్మణ్‌లను బుధవారం కరీంనగర్ రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నకిలీ ధ్రువ పత్రాలు, నకిలీ స్టాంపులతో ఆరెపల్లి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల సంతకాలను ఫోర్జరీ చేసిన కేసులో కొమ్ము భూమయ్య, గుంజ లక్ష్మయ్యను ఈ నెల 1న పోలీసులు అరెస్టు చేసి జైలు తరలించారు. జైలులో రిమాండ్‌లో ఉన్న ఇద్దరిని మరింత లోతుగా విచారించేందుకు రెండు రోజుల కిందట పోలీసులు కరీంనగర్ కోర్టులో కస్టడీ పిటిషన్ వేయగా ఒక రోజు కస్టడీకి అనుమతి లభించింది. ఈ మేరకు భూమయ్య, గుంజ లక్మన్‌లను ఉదయం 10 గంటలకు కస్టడీకి తీసుకుని మొదట విచారణ అనంతరం తీగలగుట్టపల్లిలోని ఇద్దరి ఇళ్లలో సోదాలు జరిపారు. ఈ సోదాల్లో అక్రమ భూకబ్జాలకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లు, నకిలీ స్టాంపులు, నకిలీ ధ్రువపత్రాలు లభించినట్లు తెలిసింది. ఈ డాక్యుమెంట్లను భూమయ్య ముందుంచి మరింత సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది. నకిలీ స్టాంపులు, ధ్రువపత్రాల తయారీకి సహకరించిన వారి వివరాలతోపాటు ఎవరెవరి భూములు కబ్జాచేసింది, కబ్జాకు ప్రయత్నించిన వివరాలను రాబట్టినట్లు సమాచారం. భూమయ్య తీగలగుట్టపల్లి ప్రాంతంలో కూడా పలువురి ఇళ్ల స్థలాలను కబ్జా చేశాడని ఆరోపణలు వచ్చాయి.

● భూకబ్జా, బెదిరింపులు, దౌర్జన్యానికి సంబంధించిన ఐదు కేసుల్లో జనవరి 24న అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న సీతారాంపూర్ కార్పొరేటర్ జంగిలి సాగర్‌ను పోలీసులు బుధవారం రెండోసారి కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. అరెస్టు అయిన సాగర్‌పై ఇప్పటికే రౌడీషీట్ తెరిచారు. ఫిబ్రవరి 1న మొదటిసారి కస్టడీ తీసుకుని విచారించారు.

కబ్జా స్థలాలు బాధితులకు అప్పగింతపై విచారణ

కిసాన్‌నగర్‌లో ఒక నాయకుడు తన వద్దకు భూ వివాదం పరిష్కరించాలని వచ్చిన పలువురి స్థలాలను కబ్జా చేశాడని 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వచ్చిన కథనంపై కరీంనగర్ స్పెషల్ బ్రాంచి పోలీసులు రంగంలోకి దిగి విచారణ జరుపుతున్నారు. ఆ నాయకుడు ఎవరు? బాధితులు ఎవరనేది విచారణ జరుపుతున్నారు. పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లకుండా భూములు కబ్జా చేసిన వ్యక్తి బాధితులతో మాట్లాడుతున్నట్లు తెలుస్తోంది. 8 మంది బాధితుల్లో నలుగురు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 7 : గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, చదువులో విద్యార్థులు రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేటలో ఉన్న పట్టణ గురుకుల పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న పరిస్థితులతోపాటు విద్యార్థుల హాజరు పట్టికతోపాటు విద్యార్థులకోసం తయారు చేస్తున్న వంటలను పరిశీలించారు. మోనూ ప్రకారం భోజనం పెడుతున్నారాలేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఐనా స్పెషల్ అధికారి లింగంపల్లి రాములు, వెన్నెల, భూమేష్, శ్రీనివాస్, పర్శరాములు పాల్గొన్నారు.

ముస్తాబాద్: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ముస్తాబాద్ మండల బీఆర్‌ఎస్‌వీ మండల అధ్యక్షుడు ఎండీ నవాజ్ డిమాండ్ చేశారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మిడ్ మీల్స్‌ను విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. ఈసందర్భంగా స్థానిక ఎంఆర్సీలు ఫిర్యాదు చేశారు. విద్యార్థి నాయకులు ప్రశాంత్, గుణ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో గ్రామస్థులు

చందుర్తి, ఫిబ్రవరి 7: పుట్టి పెరిగిన ఊరి కోసం జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు చేస్తున్న సేవలు అభినందనీయమని మూడపల్లి మాజీ ప్రజాప్రతినిధులు సంటి బాపురావు, చిలుక అంజిబాబు, సంటి ఏసుదాసు అన్నారు. చందుర్తి మండలం మూడపల్లిలో కరీంనగర్ జ్యోతిష్మతి విద్యా సంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు తన సోదరుడు ఆనందరావు జ్ఞాపకార్థం ఎస్సీ కాలనీ వాసుల తాగునీటి సౌకర్యార్థం దాదాపు రూ.4లక్షలతో ఆర్‌వో వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో ఎంత ఎత్తు ఎదిగినా పుట్టిన ఊరు, కన్నతల్లిని మరచిపోకూడదనే పెద్దల మాటలను జువ్వాడి సాగర్ రావు నిజం చేశారన్నారు. గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు ఏటా ఉచితంగా పుస్తకాలు అందిస్తున్నారన్నారు. గతంలో గ్రామపంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ చెడిపోయిందని, మరమ్మతు చేయించాలని గ్రామస్థులు కోరారు. అనంతరం జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు గ్రామస్థులతో ఫోన్‌లో మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు.

సేవలకు గుర్తింపు

సిరిసిల్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా అజ్మతుల్లా హుస్సేన్ నియామకం సేవలకు గుర్తింపుగా లభించినట్లు పీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి చీటి ఉమేష్‌రావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో అజ్మతుల్లాను అభినందించారు. ఉమ్మడి రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా, అఖిలభారత యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేయడంతో పాటు చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఇన్‌చార్జిగా అందించిన సేవలకు గుర్తింపు లభించిందని పేర్కొన్నారు.


అభినందిస్తున్న ఉమేష్‌రావు

పునరావాస జాబితాలో అనర్హులను తొలగించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 7: బోయినపల్లి మండలం దేశాయిపల్లి పునరావాస జాబితాలోఉన్న అనర్హుల పేర్లను తొలగించాలని, అర్హులకు న్యాయం చేయాలని గ్రామస్థులు బుధవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. గ్రామ శివారులో 1.1 అదనపు టీఎంసీ వరద కాలువ నిర్మాణం జరుగుతోందని అందులో తమ ఇళ్లు పోతున్నాయని వివరించారు. 2019లో ఆ ఇంటిని గోపు చిన్నరాజిరెడ్డి కుమారుడు గోపు శ్రీనివాసరెడ్డి వద్ద కొనుగోలు చేశానన్నారు. అందులో 8 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల జీవో ఎంఎస్ 65 ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌కు వ్యతిరేకంగా ఆ ఇంట్లోఎవరైతే ఉంటారో వారి పేర్లను రాసి ఇచ్చారు. వారు ప్రస్తుతం మరో ఇంటిని కట్టుకొని నివాసం ఉంటున్నారని వారి పేర్లను మా ఇంటి గెజిట్‌లో చేర్చారని వారిని తొలగించి కొనుగోలు చేసిన మా పేర్లను చేర్పించి నష్ట పరిహారం ఇప్పించాలని బాలగోని వెంకటమ్మ, వెంకటేశ్వర్లు, మౌనిక, బాలగోని శ్రీనివాస్ కోరారు.

దర్గాలో రైతుల ప్రత్యేక ప్రార్థనలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన రైతులు గంభీరావుపేట మండలం దమ్మన్నపేటలోని మదర్ షా వలీ దర్గాలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏటా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి అక్కడి నీటిని పొలాల్లో చల్లడం ద్వారా సమృద్ధిగా పంటలు పండుతాయని రైతుల విశ్వాసం. రైతులు రాజిరెడ్డి, మల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి, బాలరాజుయాదవ్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

12న ఉచిత వైద్య శిబిరం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రైతు చర్చ మండలిలో కరీంనగర్ నగునూర్ ప్రతిమ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 12న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రతిమ మెడికల్ శిబిరం ఆర్గనైజర్లు బాలరాజుయాదవ్ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు ఎల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, మల్లారెడ్డి, బాల్‌రెడ్డి, రాంరెడ్డి, జితేందర్, వెంకటేశ్, రమేశ్, సంపత్ తదితరులు ఉన్నారు.

మట్టి టిప్పర్ల పట్టివేత

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ శివారులోని గుట్ట ప్రాంతం నుంచి అనుమతి లేకుండా ఓ రైస్ మిల్లు నిర్మాణానికి అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్లను పట్టుకున్నామని తహసీల్దార్ రాంచందర్ బుధవారం తెలిపారు. గ్రామ శివారులోని గుట్ట నుంచి మట్టిని రవాణా చేస్తున్నారనే సమాచారంతో వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అనుమతి లేకుండా మట్టి, ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేములవాడ రూరల్ సీఐగా శ్రీనివాస్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 7: జిల్లాలోని వేములవాడ రూరల్ సీఐగా మండాడి శ్రీనివాస్‌ను నియమిస్తూ మల్టీ జోన్ ఐజీ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. వేములవాడ రూరల్ సీఐగా పనిచేసిన వై.కృష్ణకుమార్‌ను ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా సంజీవ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

సార్వత్రిక సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 7: ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశ వ్యాప్త గ్రామీణ బంద్, సార్వత్రిక సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ఆదాని, అంబానీలకు దేశ వనరులను దోచి పెట్టే విధంగా వ్యవహారం చేస్తుందని ఆరోపించారు. ఈ నెల 16న చేపట్టే గ్రామీణ బంద్‌కు తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు మీసం లక్ష్మణ్, సోమ నాగరాజు, పిట్టల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాతా రమాబాయి అంబేద్కర్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రమాబాయి సేవలను కొనియాడారు. నాయకులు లక్ష్మణ్, బాల్‌రెడ్డి, భగవంతం, నారాయణ పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్న ఆదాయానికి గండి

మల్యాల, ఫిబ్రవరి 7: తలనీలాల కాంట్రాక్టర్లు కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఆదాయానికి గండి కొట్టారు. దీంతో గతం కంటే దాదాపు రెండు కోట్ల రూపాయల మేర నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లో ధరల లేమి నేపంతో కుమ్మక్కైన వ్యాపారులు దేవస్థానం తరుపున గతంలో ఆరుసార్లు టెండర్లు నిర్వహించగా మరోసారి వాయిదా వేయకుండా తక్కువకే అప్పగించేందుకు సిద్ధం అవడం సర్వాత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దేవస్థానం పరిధిలో జనవరి నుంచి వచ్చే డిసెంబరు వరకు ఏడాది కాలపరిమితికి గాను అధికారులు కొన్ని రోజులుగా సీల్డ్, ఆన్‌లైన్, బహిరంగ టెండర్లు నిర్వహిస్తున్నారు. అయితే వ్యాపారులు ముందుకు రాకపోగా వారం రోజుల క్రితం నిర్వహించినప్పుడు ఏడాదికి గాను రూ.1.61కోట్లు పలుకగా క్రితం సారి టెండర్ రూ.3.65కోట్లు ఉందని వాయిదా వేశారు. అయితే బుధవారం ఏడో సారి నిర్వహించగా కె వెంకటనర్సమ్మ 1.62 కోట్ల రూపాయల హెచ్చుపాటగా ఉండడంతో కమిషనర్‌కు నివేదించారు. కమిషనర్ ఆదేశాల మేరకు టెండర్ ఖరారు చేయాల్సి ఉంటుందని దేవస్థానం అధికారులు తెలిపారు. అయితే కాంట్రాక్టర్లు కుమ్మక్కై దేవస్థానం ఆదాయానికి గండి కొడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. బుధవారం కూరగాయలు, పాలు, పెరుగు, పూలు,పండ్లు, వస్త్రములు, ప్రింటింగ్, శానిటేషన్, స్టేషనరీకి కూడా అధికారులు టెండర్లు ఖరారు చేశారు. ఈవో వెంకటేష్, ఏసీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం


పోషణ్ అభియాన్‌లో ఎంపీపీ రేణుక, ప్రత్యేక అధికారులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు సమతుల ఆహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ రేణుక అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు నారాయణపూర్, బొప్పాపూర్, గొల్లపల్లి, పదిర, కోరుట్లపేట, గుండారం, అక్కపల్లి, వెంకటాపూర్, హరిదాస్‌నగర్ తదితర గ్రామాల్లో బుధవారం పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రేణుక మాట్లాడుతూ పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు చర్యలు చేపడుతోందన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్య సమాజాన్ని నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు రాంచందర్, చిరంజీవి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సంతులిత ఆహారం అందుతుందని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుదగోని శ్రీనాథ్‌గౌడ్ అన్నారు. మండలంలోని రహీంఖాన్‌పేట, అనంతారం, ఇల్లంతకుంట, తాళ్లల్లపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ్ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వారానికి ఒకసారి రాగి లడ్డూలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందే ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అన్నప్రాసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు ఒగ్గు నర్సయ్యయాదవ్, తీగల పుష్పలత, ప్రత్యేకాధికారులు శ్రీనివాస్, సత్యనారాయణ, రమేష్, మాజీ సర్పంచ్ బిల్లవేని పర్శరాం, అంగన్‌వాడీ టీచర్లు మంగ, వెంకటమ్మ, విజయలక్ష్మి, రహీమున్నీసా, అరుణ, బాబాయి, స్వప్న, అయిలవ్వ, ఫీల్డ్‌అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: మిల్లెట్‌ఫుడ్ ఫెస్టివల్ సందర్భంగా పంపిణీ చేస్తున్న మిల్లెట్‌ఫుడ్‌ను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని 24వ వార్డు కౌన్సిలర్ బుర్ర లక్ష్మీశంకరయ్య కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రాజీవ్‌నగర్‌లోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం మిల్లెట్ ఫుడ్ ఫెస్టివల్ కార్యాక్రమాన్ని కౌన్సిలర్ ప్రారంభించింది. గర్భినులులు, బాలింతలు, ప్రీ స్కూల్ పిల్లలకు రాగి లడ్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు విష్ణు, అంగన్‌వాడీ టీచర్లు మమత, మంజుల, అయాలు చంద్రకళ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి : చిన్నారులు, బాలింతలు, గర్భిణీలలో పోషకాహార లోపం రాకుండా అధికారులు ప్రత్యేక నివారణ చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ ఈసంపల్లి హేమ అన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు, బాలింతలకు రాగి లడ్డూలను అందించి శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎమ్ మంజుల, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల పరిధిలోని గంభీరావుపేట,లింగన్నపేట సెక్టార్లలో బుధవారం అంగన్‌వాడీ సెంటర్లలో రాగిలడ్డూలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగ కరుణ, ఎంపీడీవో శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు పద్మజ, సంతోషి, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, ప్రశాంతి, సరోసన, మమత, శ్వేత బాగ్య, భాగ్యమ్మ, శోభ, రాజమణి తదితరులు ఉన్నారు.

కోనరావుపేట : పోషణ విలువలతో కూడిన ఆహారం తీసుకున్నప్పుడే పిల్లల ఎదుగుదల బాగుంటుందని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో రాగి లడ్డూల పంపిణీలో మాట్లాడారు. ఎంపీటీసీ చారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: ఎదురుగట్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు రాగి లడ్డూలను పంపిణీ చేశారు. సీడీపీవో ఎల్లయ్య, ప్రత్యేక అధికారి లీలారాణి, అదనపు సీడీపీవో సుచరిత, సూపర్‌వైజర్ నిర్మలాదేవి, పంచాయితీ కార్యదర్శి శ్యామల అంగన్వాడీ టీచర్లు తదిరతరులు పాల్గొన్నారు.


రాజీవ్‌నగర్‌లో మిల్లెట్‌ఫుడ్ ఫెస్టివల్

పల్లెల ప్రగతికి ప్రత్యేక చర్యలు


రోడ్డును శుభ్రం చేస్తున్న ఎంపీపీ రేణుక, ప్రత్యేక అధికారి రాంచందర్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7: పల్లెల ప్రగతికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎంపీపీ రేణుక అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు అల్మాస్‌పూర్, నారాయణపూర్, గొల్లపల్లి, బొప్పాపూర్, వెంకటాపూర్, దుమాల, అక్కపల్లి, తిమ్మాపూర్, బండలింగంపల్లి, పదిర, రాగట్లపల్లి గ్రామాల్లో బుధవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, ప్రత్యేక అధికారులు సమావేశాలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలపై చర్చించారు. నీటి నిల్వ, మురుగు కాల్వలు, గుంతలు తదితర సమస్యలను గుర్తించారు. రహదారులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా అల్మాస్‌పూర్‌లో ఎంపీపీ రేణుక మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు మెరుగు పరిచి మౌలిక వసతుల కల్పనకు పాటుపడుతోందన్నారు. ఈ నెల 15 వరకు గ్రామాల్లో స్వచ్ఛత పనులు చేపడుతోందన్నారు. ప్రజలు, వివిధ కుల, యువజన, స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు భాగస్వాములై పల్లెల అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు రాంచందర్, చిరంజీవి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: గ్రామాల్లో పారిశుధ్యం, సానిటేషన్, మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు, సమస్యలను పరిష్కరిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు అన్నారు. వీర్నపల్లి మండలంలోని 17 గ్రామాల్లో ప్రత్యేక అధికారులు ఆయా శాఖల అధికారులతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామాల్లో మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చూస్తామన్నారు. గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు ఉమారాణి, ప్రవీణ్‌కుమార్, అనిల్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలలో ప్రత్యేక అధికారుల పాలన ఏర్పడ్డ నేపథ్యంలో అన్ని గ్రామాల్లో పరిశుద్ధ పనులు చేపట్టాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో పారిశుధ్య పనులను పరిశీలించి మాట్లాడారు. ఈ నెల ఏడవ తేదీ నుండి 15వ తేదీ వరకు పారిశుధ్య పనులను నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి గ్రామంలో 15వ తేదీ వరకు పారిశుధ్య పనులు నిర్వహించాలని అన్నారు. గ్రామంలో గుర్తించిన పనులను పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి చారి, జిపి కార్యదర్శి సాయికృష్ణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రంగి గ్రామ పంచాయితి వద్ద ఏంపిపి గంగం స్వరూపరాణి మహేష్, జడ్పిటిసి గట్ల మీనయ్యలు రోడ్లను చీపిరితో ఊడ్చి పారిశుధ్య కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఏంపిడివో శంకర్, కార్యదర్శి రాందాస్, చేప్యాల గణేష్, ఆంగన్‌వాడీ టీచర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి



స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో

వేములవాడ, ఫిబ్రవరి 7 : వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ దర్శించుకున్నారు. బుధవారం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈవో డి. కృష్ణప్రసాద్ స్వామివారి ప్రసాదం అందజేశారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ కౌన్సిలర్


ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 7 : వేములవాడ పట్టణానికి చెందిన బీజేపీ కౌన్సిలర్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పట్టణంలోని 15వ వార్డుకు చెందిన తిరుమల్‌రెడ్డి కవితసుమంత్‌రెడ్డి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకొని కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని సూచించారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన ధర్మారం గ్రామస్థులు

కోనరావుపేట, ఫిబ్రవరి 7 : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మండలంలోని ధర్మారం గ్రామ ప్రజలు బుధవారం ఆయన నివాసంలో కలిశారు. మాఘ అమావాస్య సందర్భంగా జరిగే జాతరకు ఆహ్వానించారు.గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరినట్లు మాజీ ఎంపీటీసీ గంగుల ఎల్లయ్య, గ్రామస్థులు జగడి బాపురెడ్డి, వెంగలి వెంకన్న తెలిపారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

కోనరావుపేట, ఫిబ్రవరి 7 : కోనరావుపేట మండలం పల్లి గ్రామంలోని క్రీడాకారులకు బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి అందించిన క్రీడా దుస్తులను గ్రామ అధ్యక్షుడు జిన్నా అనిల్ బుధవారం అందజేశారు. జాగిరి కిరణ్ కుమార్, భూమేష్, కిషన్, నాగేందర్, రహీం, బాబు, అనిల్ ఉన్నారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి బడ్జెట్ కేటాయించాలి

జగిత్యాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాబోయే రాష్ట్ర బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి తగిన నిధులను కేటాయించాలని కోరుతూ ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావుకు టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి బుధవారం వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో వేణుగోపాల్‌రావును కలిసి సమస్యలను విన్నవించారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చే మార్చిలో గల్ఫ్ దేశాల్లో పర్యటించాలని కార్మికులు కోరుతున్నారని వివరించారు.

● ఇటీవల ప్రభుత్వ సలహాదారుగా నియామకమైన హర్కార వేణుగోపాల్ రావును బుధవారం ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహ నాయుడు ఘనంగా సన్మానించారు. కార్యాలయంలో వేణుగోపాల్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు.

అధికారులను అడ్డుకున్న రైతులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 7: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో మెడికల్ కళాశాల అదనపు భవనాల నిర్మాణాల పనులను ప్రారంభించేందుకు బుధవారం వచ్చిన అధికారులు, కాంట్రాక్టర్లను రైతులు అడ్డుకున్నారు. గ్రామ శివారులోని సర్వే నంబరు 408లో ఉన్న 50 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో నిరుపేదలకు ఉపాధి కోసం అప్పటి ప్రభుత్వాలు 40 మంది రైతులకు అందించాయి. జిల్లా కేంద్రానికి మెడికల్ కళాశాల మంజూరవడంతో రైతులకు సమాచారం ఇవ్వకుండా భూమి చదును చేశారు. నష్టపరిహారం అందించకుండానే అఘమేఘాలపై కళాశాల భవనాలను నిర్మించగా రైతులు ఆందోళన చేపట్టారు. రైతులు ఆందోళనలు చేసినా ఎమ్మెల్యే కేటీఆర్ పట్టించుకోలేదు. దీంతో తీసుకున్న భూమికి పరిహారం రాదని మిగతా భూములను ఇవ్వకుండా అడ్డుకుంటామని రైతులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మెడికల్ కళాశాల చుట్టూ ప్రహరీతో పాటు అదనపు భవనాల నిర్మాణానికి టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్, సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్, జిల్లా సర్వేయర్ శ్రీనివాస్, ఆర్ఐ సంతోష్‌కుమార్ వచ్చారు. విషయం తెలుసుకున్న బాధిత రైతులు అక్కడికి చేరుకొని సర్వేను అడ్డుకున్నారు. ప్రభుత్వం నిర్మాణానికి టెండర్లు వేసి అనుమతులు ఇచ్చిందని పనులు ప్రారంభిస్తామంటూ అధికారులతోపాటు కాంట్రాక్టర్ చెప్పడంతో రైతులు వారితో వాగ్వాదానికి దిగారు. మెడికల్ కళాశాల కోసం తీసుకున్న భూములకు పరిహారం ఇవ్వలేదని నిర్మించిన భవనాల అడుగు భూములకు పరిహారంతో పాటు భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుపేదలమైన తాము ఈ భూములపైనే ఆధారపడి జీవిస్తున్నామని, అదనపు భవనాల నిర్మాణాలకు భూములు ఇచ్చే ప్రసక్తే లేదని అవసరమైతే ముఖ్యమంత్రిని కలుస్తామంటూ కాంట్రాక్టర్, అధికారులతో గొడవకు దిగడంతో వచ్చిన ఆర్డీవోతో పాటు అధికారులు, కాంట్రాక్టర్ తీసుకొచ్చిన వాహనాలను తిరిగి పంపించి సర్వే చేయకుండానే నిలిపివేసి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, సింగిల్ విండో డైరెక్టర్ సలేంద్రి బాలరాజుయాదవ్, నాగుల రాజశేఖర్, గోడుగు మల్లేశం, లింగంపల్లి అశోక్, గొడుగు ఎల్లయ్య, లింగంపల్లి దేవరాజు, ఏనగందుల ప్రేమల, గుగ్గిళ్ల అంజవ్వ, లింగంపల్లి రాజవ్వ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న బాధితులు

లే అవుట్ లేకుండా భూముల విక్రయాలు


ఎక్స్‌కావేటర్‌తో హద్దురాళ్లను తొలగిస్తున్న అధికారులు

కోనరావుపేట, ఫిబ్రవరి 7 : కోనరావుపేట మండలం జిల్లా కేంద్రానికి దగ్గరలో ఉంటుంది. దీంతో భూములకు డిమాండ్ పెరిగింది. ఎలాంటి అనుమతి లేకుండా పచ్చని పొలాలను రియల్టర్లు ప్లాట్లుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇళ్ల పక్కన పొలాలు ఉంటే చాలు వాటిని ప్లాట్లుగా మారుస్తున్నారు. లే అవుట్ లేకుండానే విక్రయించడంతో కొనుగోలుదారులు నష్టపోతున్నారు. కోనరావుపేట మండలంలోని కొలనూరు, మర్తనపేట, కొలనూరు, గొల్లపల్లి, రామన్నపేట, సుద్దాల తదితర గ్రామాల్లో పొలాలను ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. కొలనూరు గొల్లపల్లి ప్రాంతంలో 524బీలో రెండు ఎకరాల 10 గుంటల భూమిలో ప్లాట్లు వేసి విక్రయానికి సిద్ధం చేస్తున్నారు. పచ్చని పొలాలను ప్లాట్లుగా మార్చాలంటే గ్రామపంచాయతీ పర్మిషన్ నాలా కన్వెన్షన్‌తోపాటు అన్ని అనుమతులు తీసుకోవాలి. తర్వాత ప్లాట్లుగా మార్చి విక్రయించాలి. కానీ దీనికి విరుద్ధంగా పొలాలను ప్లాట్లుగా మార్చి ఎక్కువ ధరకు విక్రయించడంతో ఏమీ తెలియని ప్రజలు ప్లాట్లను కొని నష్టపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి లే అవుట్ లేకుండా, అనుమతులు పొందకుండా ఏర్పాటు చేసిన ప్లాట్ల, రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ ప్రభుత్వ మత రాజకీయాలను తిప్పికొట్టాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి

సిరిసిల్ల రూరల్; ఫిబ్రవరి 7: కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతాపార్టీ మత రాజకీయాలను తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ పిలుపునిచ్చారు. సిరిసిల్లలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రజలతోపాటు రైతాంగం, కార్మిక వర్గాలనుంచి వచ్చే వ్యతిరేకతను గుర్తించి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ మత రాజకీయాలను తెరలేపుతోందని, అయోధ్య రామమందిరాన్ని ముందుకు తీసుకొచ్చిందని అన్నారు. పూర్తిగా నిర్మాణం కాని అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠాపన సరి కాదని పీఠాధిపతులు సూచించినా పట్టించుకోలేదని, పార్లమెంట్ ఎన్నికల ముందే కార్యక్రమాన్ని తీసుకుందని అన్నారు. జాతీయ కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఐక్య వేదికలు సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం, అఖిల భారత కిసాన్ సభలు సంయుక్తంగా ఫిబ్రవరి 16వ తేదీన దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్‌తోపాటు పారిశ్రామిక బంద్‌కు పిలుపునిచ్చినట్లు చెప్పారు. జిల్లా కార్యదర్శి కోడం రమణ, నాయకులు ఎల్లారెడ్డి, అన్నల్‌దాస్ గణేష్, రవీందర్, సత్యం, కిషన్, శేఖర్, మల్లేశం, సురేష్, తిరుపతి, రాజు, రాము, సాగర్, విజయ్ పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని నివారించాలి


కార్మికులతో కలిసి ధర్నా చేస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 7 : వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని నివారించాలని, కార్మికులు, ఆసాములకు నిరంతరం ఉపాధి కల్పించాలని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలో ప్రస్తుతం నెలకొన్న వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని చేనేత జౌళీశాఖ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి గత ప్రభుత్వం అనుసరించిన విధానాలే కారణమన్నారు. పదేళ్లలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభానికి శాశ్వత పరిష్కారం చూపే విధంగా కాకుండా తాత్కాలిక ప్రయోజనం చేకూర్చే విధంగా మాత్రమే స్థానిక ఎమ్మెల్యే మాజీ మంత్రి కేటీఆర్ పని చేశారని మండి పడ్డారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యల శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్‌లతోపాటు ప్రభుత్వ ఆర్డర్‌లను అందించాలని కోరారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి పది శాతం యారన్ సబ్సిడీ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, నాయకులు ఎల్లారెడ్డి, అన్నల్‌దాస్ గణేష్, ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, మండల రాజు, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, ఉడుత రవి, వైపని వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కమ్మరి కుంట కిషన్, రాము, బెజిగం సురేష్, మోర తిరుపతి, కంది మల్లేశం, సబ్బని చంద్రకాంత్, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.